నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలి



కాలువ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు తదితరులు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని జానకి రామ టవర్స్ వద్ద చేపడుతున్న వరద నీటి కాలువ నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఆయన జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హైదర్‌నగర్ డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామని, స్ట్రామ్ వాటర్ డ్రైన్ తదితర అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. పనుల్లో జాప్యం లేకుండా త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. డివిజన్ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని, అన్ని వేళలా ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. కార్యక్రమంలో అధికారులు ఏఈ రాజీవ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్, దేవి, డివిజన్ ఉపాధ్యక్షుడు పోతుల కాంతారావు, కాలనీ వాసులు హరి, సురేష్, ఆదినారాయణ, కిరణ్, నవీన్, శరత్, ప్రభాకర్, మణికంఠ, విజయ్, తులసి తదితరులు పాల్గొన్నారు.



బండి రమేష్‌తో చున్నూ పాషా తదితరులు

కాంగ్రెస్ బలోపేతానికి కృషి

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. మూసాపేటకు చెందిన చున్నూ పాషా కాంగ్రెస్‌లో చేరిన సందర్భంగా శనివారం మర్యాదపూర్వకంగా ఆయనను కలిశారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ కాలనీల్లో సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని, నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. పార్టీని మరింత బలోపేతం చేయాలని, ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు ప్రతి పేదవాడికి అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు గోపిశెట్టి రాఘవేందర్, తూము వేణు, సతీష్ గౌడ్, తూము సంతోష్, స్వరూప, ఎల్లేష్, లక్ష్మయ్య, నయిమ్, సచిన్, షకీల్, వెంకటేష్‌యాదవ్, ఇర్ఫాన్, అమీర్, కాజా పాషా, మొయిన్ తదితరులు పాల్గొన్నారు.

కో కన్వీనర్లకు సెట్‌లో బాధ్యతలు ఇవ్వొద్దు



మాట్లాడుతున్న బొట్ల భిక్షపతి తదితరులు

కూకట్‌పల్లి: గతంలో సెట్‌లలో పనిచేసిన కో-కన్వీనర్లకు ఈసారి సెట్‌లలో ఏ ఇతర బాధ్యతలు ఇవ్వరాదని జేఎన్‌టీయూహెచ్ జేఏసీ చైర్మన్ బొట్ల భిక్షపతి డిమాండ్ చేశారు. శనివారం ఆయన విద్యార్థి సంఘాల నాయకులతో కలిసి మాట్లాడుతూ సెట్ బాధ్యతలను అడ్మినిస్ట్రేషన్ బాధ్యతలు లేని ప్రొఫెసర్లకు, సీనియారిటీ ఆధారంగా ఇవ్వాలన్నారు. గత సెట్‌లలో సీనియారిటీ, అడ్మినిస్ట్రేషన్‌లో పని చేసే వారికి మాత్రమే అదనపు బాధ్యతలు అప్పగించారని, సీనియర్ అడ్మినిస్ట్రేషన్ బాధ్యతలు లేని ప్రొఫెసర్లకు అన్యాయం చేశారన్నారు. అనుభవం లేని కన్వీనర్లు గత సెట్‌లలో ప్రకటించటం వల్ల కో కన్వీనర్లు దగ్గరుండి కన్వీనర్లను డమ్మీలను చేసి అవకతవకలకు పాల్పడ్డారన్నారు. ఈసారి ఖచ్చితంగా 2023 సెట్ కో కన్వీనర్లకు బాధ్యతలు ఇవ్వవద్దని డిమాండ్ చేశారు. సీనియర్, అడ్మినిస్ట్రేషన్ పదవి లేని ప్రొఫెసర్లకు బాధ్యతలు అప్పగించాలన్నారు. లేని పక్షంలో అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు మంద రంజిత్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ బల్లర్ సందీప్, విద్యార్థి సంఘాల నాయకులు జగన్, భాను, సెక్రటరి ప్రణయ్, కిరణ్, శ్రావణ్, కమిటీ సభ్యులు, విద్యార్థి సంఘాల నాయకులు ఎరవెల్లి జగన్, భాను ప్రకాష్, దాస్యం విక్రాంత్, తదితరులు పాల్గొన్నారు.

హుడా ట్రేడ్ సెంటర్‌లో ఆయుర్వేద వైద్యశిబిరం

శేరిలింగంపల్లి: హుడా ట్రేడ్ సెంటర్‌లోని సీతారామాంజనేయస్వామి ఆలయంలో శనివారం ఉచిత ఆయుర్వేద శిబిరాన్ని నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. స్థానికులు రామచంద్రమూర్తి ఆధ్వర్యంలో బనారస్ హిందూ విశ్వవిద్యాలయం పూర్వ తెలుగు ఆయుర్వేద వైద్యుల అసోసియేషన్, గవర్నమెంట్ అయుర్వేద ఆస్పత్రి ఎర్రగడ్డ సహకారంతో శిబిరం కొనసాగింది. ఈ సందర్భంగా 150 మంది స్థానికులకు వైద్య పరీక్షలు చేశారు. శిబిరంలో బీహెచ్‌యూ తెలుగు ఆయుర్వేద వైద్యుల అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పివివి ప్రసాద్, ఉపాధ్యక్షులు డా.సుజాత, కార్యదర్శి డాక్టర్ వి నర్సింహ, సభ్యులు డాక్టర్ శైలజావాణి, ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి డాక్టర్ రామచంద్రారెడ్డి, సూపరింటెండెంట్ డాక్టర్ రాజేశ్వరి, డాక్టర్లు శోభారాణి, విజయలక్ష్మీ, భవాని పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్, అమ్మయ్య చౌదరి, హుడా ట్రేడ్ సెంటర్ సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, రాము, ఆంజనేయులు, శ్రీనివాసచారి, చంద్రశేఖర్‌రావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ అజీజ్ నగర్‌లో శనివారం కార్పొరేటర్ సబిహా బేగం రూ. 55 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న స్ట్రాం వాటర్ డ్రైన్, సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అజీజ్ నగర్, మెరాజ్‌నగర్, పద్మావతి నగర్, సైడ్ ట్రీ మీదుగా ప్రవహించే వర్షపు నీటి కారణంగా పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో రూ.55 లక్షల వ్యయంతో స్ట్రాం వాటర్ డ్రైన్, సీసీ రోడ్డు పనులకు శ్రీకారం చుట్టామన్నారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో, త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో మహ్మద్ మోయిజ్, మొహ్మద్ చున్ను, జావీద్, మతిన్ తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం తదితరులు

పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

కూకట్‌పల్లి: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయమని ఏఐసీసీ తెలంగాణ కమ్యూనికేషన్ కోఆర్డినేటర్ సుజాత పాల్ అన్నారు. శనివారం టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో గాంధీభవన్‌లో పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సుజాత పాల్‌ను శాలువాతో నియోజకవర్గ నేతలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, అధికార ప్రతినిధులు డా. సత్యం శ్రీరంగం, కాల్వ సుజాత, భవానీ రెడ్డి, సంధ్యారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుజాత పాల్ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం తీసుకోవాల్సిన చర్యలపై పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశంపై టీపీసీసీ అధికార ప్రతినిధులకు వివరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో దేశంలోనూ పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ప్రజల జీవితాల్లో వెలుగులు నింపడానికి ఆరు గ్యారంటీ పథకాల దరఖాస్తుల కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని, పేద ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పాటు పడుతుందన్నారు.



సన్నాహక సమావేశంలో పాల్గొన్న డా. సత్యం శ్రీరంగం తదితరులు



వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

రేడియేషన్‌తో రోగాలొస్తున్నాయి..

- సెల్ టవర్ తొలగించాలని కాలనీవాసుల ఆందోళన
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే
- తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు

ఓల్డ్‌బోయిన్‌పల్లి: అంజయ్యనగర్‌లో ఓ ఇంటిపై ఏర్పాటు చేసిన ఇండస్ టవర్స్ లిమిటెడ్ కంపెనీ సెల్ టవర్ కారణంగా రేడియేషన్‌తో ఇబ్బందులు పడుతున్నామని, కాలనీలో పలువురు రోగాల బారిన పడుతున్నారని ఆరోపిస్తూ కాలనీ వాసులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెల్ టవర్‌ను తొలగించాలని జీహెచ్ఎంసీ అధికారులు, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు ఫిర్యాదు చేశామన్నారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శనివారం స్థానిక కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి టవర్‌ను పరిశీలించారు. సెల్ టవర్‌కు ఉన్న అనుమతులపై ఆరా తీశారు. అనుమతులు లేకుండానే ఇండస్ టవర్ కంపనీ సెల్ టవర్‌ను ఏర్పాటు చేసిందని అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. అనంతరం స్థానికులను అడిగి సమస్యను తెలుసుకున్నారు. సంవత్సర క్రితం టవర్ ఏర్పాటు చేశారని ఇది ఏర్పాటైన తర్వాత ప్రజలు వివిధ రుగ్మతలతో ఇబ్బందులు పడుతున్నారని, ఈ విషయాన్ని జీహెచ్ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఎన్నికలు రావడంతో ఎవరూ పట్టించుకోలేదని ఇప్పుడైనా తమ ఆరోగ్యాలు కాపాడాలని టవర్‌ను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. ఈ విషయంపై ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు ఇబ్బందులు కలిగించే టవర్‌పై తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. నివాసాల మధ్యలో సెల్ టవర్‌ను ఏర్పాటు చేయడం వల్ల ప్రజల ఆరోగ్యంపై ప్రభావం పడుతుందన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన సెల్ టవర్‌ను ఎందుకు తొలగించడం లేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే సెల్ టవర్‌ను తొలగించాలని కూకట్‌పల్లి సర్కిల్ ఉప కమిషనర్ కృష్ణయ్య, టౌన్ ప్లానింగ్ అధికారి సుస్మితలను ఆదేశించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నరేందర్‌గౌడ్, మక్కాల నర్సింగ్‌రావు, ఇర్ఫాన్, బుర్రి యాదగిరి, కర్రె జంగయ్య, తిరుపతిరావు, ఇబ్బు, పిట్ల రాజు, కోతిమీర్ అశోక్, నర్సింగ్‌రావు, ఖాదీర్, గణేష్, రాజుగౌడ్, ఐలేష్, చందుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



అంజయ్యనగర్‌లో ఏర్పాటు చేసిన సెల్ టవర్

విద్యార్థులకు బ్యాగులు పంపిణీ

రాయదుర్గం: విద్యార్థులకు స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. రాయదుర్గంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ఎస్.కే.తాజ్‌బాబు బ్యాగుల పంపిణీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదవడంతోపాటు అటెండెన్స్ కూడా 100 శాతం ఉండేలా చూసుకోవాలని సూచించారు. అత్యధిక అటెండెన్స్ సాధించిన వారికి ప్రోత్సాహకంగా బ్యాగులను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు సమస్యను పరిశీలించిన ఎమ్మెల్యే



గచ్చిబౌలి: ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులు చేయాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అధికారులకు సూచించారు. శేరిలింగంపల్లి డివిజన్‌లోని మసీదుబండ మారుతీ నగర్‌లో ఎస్ఎంఆర్ అపార్ట్‌మెంట్స్ పక్కన తలెత్తిన రోడ్డు సమస్యపై కాలనీవాసుల ఫిర్యాదు మేరకు టౌన్‌ప్లానింగ్ అధికారులతో కలిసి శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నలుగురు బిల్డర్లు ఉండటం వలన సమన్వయ లోపంతో సమస్య తలెత్తిందని ఈ సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. నిర్దిష్ట రోడ్డును వదిలి ప్రహరీ నిర్మించుకోవాలని, ప్రజావసరాల దృష్ట్యా కాలనీవాసులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు.కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారులు ఏసీపీ మెహ్రా, టీపీఎస్ రవీందర్, టీపీఎస్ రమేష్, నాయకులు శ్రీనివాస్‌యాదవ్, రవీందర్‌యాదవ్, ప్రసాద్, శ్రీకాంత్, ప్రసాద్, కాలనీవాసులు పాల్గొన్నారు.

సమాజసేవలో.. మేము సైతం..

సాక్షి, సిటీ బ్యూరో: ఆపన్నుల సేవలో తాము సైతం పునరంకితమవుతామని కార్పొరేట్ ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు. నగరంలోని మాదాపూర్‌లో ఉన్న ఫిన్‌కార్ప్ సంస్థ సింక్రనీ ఆధ్వర్యంలో డబుల్ డ్రైవ్ పేరిట సేవా కార్యక్రమాలకు నిధుల సేకరణ చేపట్టారు. వినోదభరితంగా అదే సమయంలో వితరణ మార్గంగా సాగిన ఈ ఈవెంట్ ఆకట్టుకుంది. వందలాదిగా ఉద్యోగులు పాల్గొని పలు వర్చువల్ గేమ్స్ ఆడారు. ఈ కార్యక్రమం ద్వారా సేకరించిన నిధుల్ని సమాజ సేవకు అందించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

యువతి అదృశ్యం



ప్రవళ్లిక

గచ్చిబౌలి: సూపర్ మార్కెట్‌లో డ్యూటీకంటూ వెళ్లిన యువతి అదృశ్యమైన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఏఎస్ఐ సాయులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. సుదర్శన్‌నగర్‌లో నివాసం ఉండే ఎం.ప్రవళిక(19) స్థానికంగా ఓ సూపర్‌మార్కెట్‌లో పని చేస్తోంది. ఈ నెల 25న మధ్యాహ్నం 12.30 గంటలకు డ్యూటీకి వెళుతున్నానని చెప్పి వెళ్లింది. సాయంత్రం అయినా తిరిగి రాకపోవడంతో సమీప ప్రాంతాలలో వెదికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో తల్లి నాగమణి గచ్చిబౌలి పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కల్వరి టెంపుల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



కల్వరి టెంపుల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్‌లోని అంబేద్కర్ భవన్ కమిటీ హాల్‌లో శనివారం కల్వరి టెంపుల్ ఆసుపత్రి సౌజన్యంతో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జనరల్, చిన్న పిల్లల, గైనకాలజీ, ఎముకలు, కీళ్ల వైద్య నిపుణులు వైద్య పరీక్షలు చేశారు. సుమారు 250 మంది పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కాంగ్రెస్ సీనియర్ నాయకులు, ప్రముఖ న్యాయవాది సింధం శ్రీకాంత్ మాట్లాడుతూ సేవాభావంతో వైద్య శిబిరాల ద్వారా పేదలకు ఉచిత పరీక్షలు, మందులు అందించటం అభినందనీయమన్నారు. కల్వరి టెంపుల్ హాస్పిటల్ వ్యవస్థాపకులు రెవరెండ్. డాక్టర్ సతీష్ కుమార్, హాస్పటల్ ఎండి డాక్టర్ రాజేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కల్వరి టెంపుల్ హాస్పిటల్ ఎండీ డాక్టర్ రాజేష్ మాట్లాడుతూ పేద, మధ్య తరగతి కుటుంబాలకు నాణ్యమైన వైద్యాన్ని తక్కువ ధరకు అందించాలనే ఉద్దేశంతో డాక్టర్ సతీష్ కుమార్ కల్వరి టెంపుల్‌లో ఆసుపత్రి స్థాపించారన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించడానికి ఉచిత క్యాంపులు నిర్వహించటం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్ యాదవ్, సదా మహేష్, సదా చన్ని మహేష్, విష్ణు, రాఘవేందర్ రెడ్డి, మహేందర్‌రెడ్డి, నక్క సురేష్, నరేందర్ రెడ్డి, వైద్యులు చంద్రిక, సమీర్, రావు, వినోద్, అడ్మిన్ రాజా శ్రీధర్, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల వార్షికోత్సవం

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లిలో సాధన ఇన్ఫినిటీ ఇంటర్నేషనల్ స్కూల్ ఆరవ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు.'పనాష్ రిథమ్ ఆఫ్ సెన్సెస్' పేరిట నిర్వహించిన కార్యక్రమాన్ని పాఠశాల చైర్మన్ సునంద్ సూరపనేని, చైర్‌పర్సన్ పద్మప్రియ, మేనేజింగ్ డైరెక్టర్ సాధన సూరపనేని ప్రారంభించారు. అనంతరం చిన్నారుల నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. క్రీడా విజేతలకు ప్రశంసాపత్రాలను అందించారు. పాఠశాల డైరెక్టర్ మురళీ మోహన్, ప్రిన్సిపల్ ప్రమీల, మాధవిలత, శిరీష, వందన పాల్గొన్నారు.



మాదాపూర్: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో నిర్వహిస్తున్న అన్నమయ్య స్వరార్చన కార్యక్రమంలో భాగంగా శనివారం మయూరి నృత్యాలయ శిష్యబృందం నృత్యార్చన చేశారు. గురువు రాజనాల దేవి రామ్‌కుమార్ శిష్యబృందం గణేశ పంచరత్న, కీర్తన, శరణు శరణు, దశావతారశబ్దం తదితర అంశాలను ప్రదర్శించారు. అనంతరం కళాకారులను డాక్టర్ శోభారాజు జ్ఞాపికలతో సత్కరించారు.



టాస్ వేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తదితరులు

క్రికెట్ పోటీలు ప్రారంభం

కూకట్‌పల్లి: బాలానగర్ డివిజన్‌లోని రాజీవ్ గాంధీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను స్థానిక ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా రాజీవ్‌గాంధీ నగర్‌లో క్రికెట్ పోటీలు ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. కుల, మతాలకు అతీతంగా అందరూ కలిసికట్టుగా ఉండాలని కోరారు. ఇటువంటి కార్యక్రమాలను ఏర్పాటు చేయటం వల్ల మానసిక ఉల్లాసంతో పాటు, ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోచ్చని అన్నారు. కార్యక్రమంలో రాజీవ్‌గాంధీ నగర్ అధ్యక్షుడు అజీజ్, ప్రధాన కార్యదర్శి నరేష్ కుమార్, యూత్ అసోసియేషన్ క్రీడాకారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మోతీనగర్: మరమ్మతుల కారణంగా 11కేవీ అయ్యప్ప ఫీడర్ పరిధిలో శనివారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ అధికారులు తెలిపారు. ఫీడర్ పరిధిలోని తండా స్కూల్, ఏపీ మోడల్ స్కూల్, సిక్కు కాలనీ, సూర్య పేపర్స్, రజక కాలనీ ప్రాంతాల్లో, హుండయ్ 11 కేవీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్ర 5 గంటల వరకు జైన్ శంకర్ కన్‌స్ట్రక్షన్స్, తపస్వి మోటార్స్, రెయిన్‌బో ఆసుపత్రి, జైహింద్ కాలనీ, యుసీవీ మోటార్స్, మైహోం 11కేవీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తండా కమాన్ ప్రాంతం, 169 నుంచి 213 ప్లాట్ వెంర్స్ సిజీఆర్ స్కూల్ ప్రాంతం, చేపల పులుసు రెస్టారెంట్ ప్రాంతంలో విద్యుత్ నిలిపివేయనున్నట్లు తెలిపారు.

◆ **భాగ్యనగర్‌కాలనీ:** యల్లమ్మబండ 11 కేవీ ఫీడర్ పరిధిలో ఆదివారం మరమ్మతుల కారణంగా విద్యుత్ నిలిపివేయనున్నట్లు విద్యుత్ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఫీడర్ పరిధిలోని మహంకాళి నగర్, పంచమి కాలనీ, శంషీగూడ విలేజ్, శంషీగూడ సబ్ స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు జన్మభూమి కాలనీ, శివమ్మ కాలనీ, దత్తాత్రేయ కాలనీ, గాంధీ నగర్, సుభాష్ చంద్ర బోస్ నగర్ కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్‌తో వేగంగా నిర్మాణాలు

గచ్చిబౌలి: భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ 5 గ్రేడ్ సిమెంట్‌తో వేగంగా నిర్మాణాలు చేపట్టవచ్చని భారతి సిమెంట్ సీనియర్ టెక్నికల్ ఇంజనీర్ నితీష్ యాదవ్ పేర్కొన్నారు. శనివారం కొండాపూర్‌లోని మాదాపూర్ స్టీల్ హౌజ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భారతి సిమెంట్ నాణ్యత గురించి బిల్డర్లకు అవగాహన కల్పించారు. ఈ సిమెంట్ స్లాబ్‌లు, పిల్లర్లు, బ్రిడ్జీలు, రహదారుల నిర్మాణానికి సరైన ఎంపిక అని అన్నారు. కార్యక్రమంలో భారతి సిమెంట్ చీఫ్ మేనేజర్ సతీష్‌కుమార్, మాదాపూర్ స్టీల్ హౌజ్ ఏజెన్సీస్ యజమాని నర్సిరెడ్డి పాల్గొన్నారు.

మ్యాట్రిమోని మోసం కేసులో ఇద్దరి అరెస్ట్



మద్దుగారి చంద్రకాంత్



మద్దుగారి భవాని

రాయదుర్గం: మ్యాట్రిమోని మోసం కేసులో సైబరాబాద్ సైబర్ క్రైమ్స్ పోలీసులు ఇద్దరిని అరెస్ట్ చేశారు. ఈ కేసులో ఏ1గా విజయవాడలోని తాడేపల్లి అపర్ణా టవర్స్‌లో నివాసముంటున్న వ్యక్తి మద్దుగారి చంద్రకాంత్, ఏ2గా నట్టాభవాని అలియాస్ మద్దుగారి భవానీగా గుర్తించి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మ్యాట్రిమోనియల్ ఫ్రాడ్ కేసును పోలీసులు దర్యాప్తు చేస్తూ పలు అంశాలు, వారు చేసిన మోసాలను గుర్తించారు. ఓ మహిళ ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. సదరు మహిళ తెలుగు షాదీ డాట్‌కామ్ యాప్‌లో చంద్రకాంత్‌ను కలిశారు. డిసెంబర్ 2023 తర్వాత వాట్సాప్‌లో కమ్యూనికేషన్ కొనసాగించారు. చంద్రకాంత్ డాక్టర్‌గా ఏపీ, తెలంగాణ, కర్నాటకలో ఆస్పత్రుల చైన్ వ్యాపారానికి ప్రణాళిక చేస్తున్నానని, బ్యాంకు ఖాతాతో ఆదాయపు పన్ను సమస్యలు ఎదుర్కొంటున్నట్టు ఆమెకు వివరించారు. నకిలీ ఎస్‌బీఐ ఏటీఎం స్లిప్పులను చూపిస్తూ చంద్రకాంత్ మాయమాటలు చెప్పడమే కాకుండా మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో నిర్మాణంలో ఉన్న ఆస్పత్రి చిత్రాలు చూపించి ఆమెను ఒప్పించాడు. ముఖ్యంగా ఆదాయపన్ను సమస్యల పరిష్కరించడానికి అప్పుగా రూ.6 లక్షలు కావాలని కోరగా, స్నేహితుల వద్ద అప్పు చేసి చంద్రకాంత్‌కు అందించారు. కొద్ది రోజుల్లోనే ఈ మొత్తాన్ని వాపస్ చేస్తానని నమ్మబలికాడు. అనంతరం సాకులు చెబుతూ కమ్యూనికేషన్ పూర్తి కట్ చేశారు. దీంతో ఆమె అనేక అంశాలు వివరిస్తూ అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. తనను తానుగా చంద్రకాంత్ ఉన్నతమైన వ్యక్తిగా చిత్రీకరిస్తూ మోసం చేయడానికి వైద్యుడిలా కూడా నటించాడు. అనంతరం 2021లో మహిళతో పరిచయం ఏర్పడి ఆమెకు ఆన్‌లైన్‌లో నట్టాభవాని అని పేరుపెట్టారు. ఆ తర్వాత ఇద్దరు కలిసి నేరాలకు పాల్పడడం ప్రారంభించారు. భవాని పేరిట అనేక ఖాతాలు కూడా తెరిచాడు. 2023 నవంబర్‌లో చంద్రకాంత్ షాదీడాట్‌కామ్‌లో నకిలీ ప్రొఫైల్ నమోదు చేసుకున్నాడు. డాక్టర్ వృత్తిలో ఉంటూ ఉన్నతస్థాయిలో ఆర్థికంగా ఎంతో ఎదిగానని, వ్యాపారవేత్తగా కూడా చెప్పుకున్నాడు, అనేక మంది మహిళలను కూడా సంప్రదించాడు. ఇందు, దివ్య, మౌనిక వంటి వారిని కూడా ఆదాయపు పన్ను సమస్యలు వివరించాడు, వారిని కూడా మోసం చేసి భవాని బ్యాంకు ఖాతాలకు డబ్బు బదిలీ చేయడానికి చంద్రకాంత్, భవానీ వివిధ సిమ్ కార్డులను వినియోగించారు. అనేక బ్యాంకు ఖాతాలు తెరిచారు. వారిద్దరూ మోసపూరిత పథకాలు అమలు చేయడం, నకిలీ పత్రాలు సృష్టించడం, నకిలీ ఏటీఎం స్లిప్‌లు సృష్టించి బాధితులను మోసం చేస్తూ వచ్చారు. అదే క్రమంలో గచ్చిబౌలి పీఎస్ పరిధిలో ఓ మొబైల్ షాపు యజమానిని మోసం చేశాడు. ఈ క్రమంలోనే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాలలో అనేక కేసులు నమోదయ్యాయి. పోలీసులు ఎట్టకేలకు ఆట కట్టించారు. గతంలోనూ మద్దుగారి చంద్రకాంత్, కట్టాభవాని అలియాస్ మద్దుగారి భవానిపై నాలుగు కేసులు నమోదయ్యాయి.

వైభవంగా శ్రీరామ్ శోభాయాత్ర

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నల్లగండ్లలోని అపర్ణ సైబర్‌జోన్ నుంచి శ్రీరామ్ శోభాయాత్రను కనులపండువగా నిర్వహించారు. శనివారం ఈ యాత్రను ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ ప్రారంభించారు. అయోధ్య సంబరాలను పురస్కరించుకొని నల్లగండ్ల నుంచి గోపన్‌పల్లి రంగనాథ స్వామి ఆలయం వరకు చేపట్టిన ఈ యాత్రలో భక్తులు జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు. అపర్ణ సైబర్ కమ్యూన్, త్రిశాల, రాఘవేంద్ర, అపర్ణ సైబర్‌లైఫ్, హిమసాయి లేక్ వ్యూ, అపర్ణ గ్రాండే, అపర్ణ సరోవర్, రాంకీ వన్ కాస్మోస్, గెలాక్సీ, మంజీర డైమండ్ టవర్ మీదుగా రంగనాథస్వామి ఆలయానికి చేరుకుంది. కార్యక్రమంలో హుడా కాలనీ అధ్యక్షులు మంత్రిప్రగడ సత్యనారాయణరావు, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌యాదవ్, ప్రసాద్ పాల్గొన్నారు.

కర్ణాటక సంగీత కచేరీ

మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న త్యాగరాజ ఆరాధనోత్సవాలలో కళాకారులు శివానీ సరస్వతుల గాత్ర కచేరీ వీనులవిందుగా సాగింది. అలాగే కర్ణాటక సంగీత కచేరీతో సందర్శకులను అలరించారు. హోప్ అడ్వర్టైజింగ్ ప్రై.లి.డైరెక్టర్ సునీత శివానీని సన్మానించారు.కాగా నేషనల్ హ్యాండ్‌లూమ్ ఎక్స్‌పో గాంధీ శిల్పారామంలో సందర్శకుల తాకిడి పెరిగింది.

ఉరివేసుకుని మహిళ ఆత్మహత్య

భాగ్యనగర్‌కాలనీ: మానసిక సమస్యలతో బాధపడుతున్న ఓ మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. సీఐ సిహెచ్. వెంకన్న కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తూర్పు గోదావరి జిల్లా, ఆత్రేయపురం, పల్లపు వీధికి చెందిన శ్రీనివాసరాజు, అనంత లక్ష్మీ నాగదేవి (29) దంపతులు నగరానికి వలస వచ్చి భాగ్యనగర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. గత పదేళ్లుగా మానసిక సమస్యలతో బాధపడుతున్న నాగదేవి చికిత్స పొందుతోంది. అయినా వ్యాధి నయం కాకపోవటంతో మనస్తాపానికిలోనైన లక్ష్మీ నాగదేవి శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. దీనిని గుర్తించిన ఆమె కుమారుడు చుట్టు పక్కల వారికి చెప్పడంతో వారు భర్తకు సమాచారం అందజేశారు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న కేపీహెచ్‌బీ పోలీసులు వివరాలు సేకరించారు. మృతురాలి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.